మాదిగ ఉపకులాల పోరాట ఫలితమే వర్గీకరణ

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: గత 30 ఏళ్లుగా ఎస్సీ మాదిగ ఉపకులాలు చేస్తున్న పోరాటం ఫలించిందని, సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వటం హర్షణీయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పచెబుతూ తీర్పు ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి, ఎమ్మెల్యే డప్పు వాయించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, చిరంజీవి, రమేష్, స్వామి, గాలయ్య పాల్గొన్నారు.

పట్టాలు పొందిన వారికే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

చాదర్‌ఘాట్: పట్టాలు పొందిన లబ్ధిదారులకే డబుల్ ఇళ్లను అప్పగించాలని మంఖాల్–2 డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం అసోషియేషన్ ప్రధాన సలహాదారుడు ఖాజా అన్నారు. చాందిని ఫంక్షన్‌హాల్లో సోమవారం నిర్వహించిన మంఖాల్–2 లబ్ధిదారుల సమావేశంలో ఖాజా మాట్లాడారు. మలక్‌పేట, యాకత్‌పురా సమీప ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు లక్కీడ్రా ద్వారా ఇళ్లు కేటాయించారన్నారు. గత ప్రభుత్వం పట్టాలు కేటాయించినప్పటికీ ఇళ్లను మాత్రం అప్పగించలేదని ధ్వజమెత్తారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఇళ్లను అప్పగించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి సలహాదారుడిగా ఖాజా, సయ్యద అహ్మద అలీ, ఉపాధ్యక్షుడిగా మహ్మద్‌అలీ, కార్యదర్శులుగా జావేద్‌ఖాన్, సయ్యద్‌మోసిన్, కోశాధికారిగా సులేమాన్‌ను ఎన్నుకున్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు



జంగయ్యకు నగదు అందజేస్తున్న నాయకులు

మన్సూరాబాద్: కేరళ వయనాడ్ బాధితులను ఆదుకోవడం అందరి బాధ్యత అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ.. హయత్‌నగర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాల నుంచి విరాళాలు సేకరించామన్నారు. కేరళలో జరిగిన ప్రకృతి విలయతాండవాన్ని కేంద్రప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రమావత్ సక్రు, శ్రీదేవి, సరిత, నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో..

నాగోలు: కేరళ వరద బాధితులను ఆదుకోవాలని పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సరూర్‌నగర్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించి సీపీఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యకు అందజేశారు. మండల కార్యదర్శి బతరాజు నరసింహా, సహాయ కార్యదర్శి కందుల సుధాకర్ ఇతర పార్టీ నాయకులు వివిధ వ్యాపారుల నుంచి రూ.5000 నగదును సేకరించామన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చిత్రసీమకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జిన్న ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాలనీ కమ్యూనిటీహాల్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. కాలనీలోని ఖాళీగా ఉన్న ప్లాట్లలో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా షెడ్లువేసి వాషింగ్ సెంటర్, టీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వాణిజ్య సముదాయాలకు ఎదురుగా వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దోనూరి మధుసూధన్‌రెడ్డి, సభ్యులు మాధవరెడ్డి, జేజే రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఐ సుధాకర్‌కు సీపీ అభినందనలు


డీఐ సుధాకర్ అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: ఏప్రిల్ 29 నుంచి మే 17వ వరకు అమెరికాలోని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎల్‌బీనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎర్రోజు సుధాకర్‌ను సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు. ప్రపంచాన్ని మరింత సురక్షితమైన ప్రదేశంగా మార్చడంతో పాటు ఇండో పసిఫిక్, దక్షిణ మధ్య ఆసియా ప్రాంతాల్లో దేశాంతర నేరాల నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి ఈ కార్యక్రమంలో శిక్షణ ఇవ్వడం జరిగిందని ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న నూతన అంశాలను రాచకొండ పరిధిలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కూడా ఉపయోగించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 46 దేశాలకు చెందిన పోలీసుల అధికారులతో అమెరికా (ఐవీయల్‌బీ) అంతర్జాతీయ సందర్శకుల నాయకత్వ కార్యక్రమం 2024 నిర్వహించిన భారతదేశం నుంచి ఎల్‌బీనగర్ డీఐ సుధాకర్ ఒక్కడే ఈ కార్యక్రమానికి వెళ్లాడు. 46 దేశాలకు చెందిన పోలీస్ అధికారులను ఆహ్వానించి సుమారు నెల రోజుల పాటు 4 రాష్ట్రాలను చుట్టి ముఖ్యంగా మానవ అక్రమ రవాణాపై నివారణ, గంజాయి, డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్స్, అనుమతి లేకుండా దేశంలోకి చొరబాటుదారుల కట్టడి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ


సరుకులను అందజేస్తున్న విద్యార్థులు

చంపాపేట: చంపాపేట డివిజన్ గాయత్రినగర్ చౌరస్తాలోని నాగార్జున ది నెక్స్ జెన్ పాఠశాల విద్యార్థులు వైదేహీ అనాథ బాలికల ఆశ్రమానికి ఐదు క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల కందిపప్పు అందజేశారు. విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఇటీవల పాఠశాలలో నిర్వహించిన చారిటీ డే సందర్భంగా విద్యార్థులు యాజమాన్యం సహకారంతో సరుకులు అందించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేందుకే ప్రతీ ఏడాది ఓ రోజు చారిటీ డే నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కట్టా రవీందర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు సువర్చల, అంబాదాస్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం పాటించాలి.. పచ్చదనం పెంపొందించాలి


కొత్తపేటలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో కేక్‌కట్ చేయిస్తున్న జెడ్పీ హేమంత్ కేశవ్ పాటిల్


నాగోలులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డీసీ, కార్పొరేటర్

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భాగస్వాములై పరిసరాలను శుభ్రపరిచారు. చెత్త వేసిన ప్రాంతాలను శుభ్రపరిచి ముగ్గులు, వేసి ఇక్కడ వ్యర్థాలు వేయరాదని అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులకు పర్యావరణంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు పెంపకం బాధ్యతగా భావించాలన్నారు.
–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్లబృందం


మన్సూరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి


బీఎన్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి


హయత్‌నగర్‌లో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో..


చంపాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి


గడ్డిఅన్నారం డివిజన్‌లో ..


కాలనీవాసులకు మొక్కలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేతమధుకర్‌రెడ్డి


పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 27, వంకాయ రూ. 40, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 45, బీర రూ. 35, క్యాబేజీ రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 60, క్యారెట్ రూ. 35, దొండ రూ. 38–40, చిక్కుడు రూ. 75, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 38, దోస రూ. 17, సొర రూ. 13, పొట్ల రూ. 15, ఉల్లిగడ్డ రూ. 37, చామగడ్డ రూ. 40.
ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బోనాల ఉత్సవంలో కేంద్రమంత్రి


ఉత్సవంలో పాల్గొన్న బండిసంజయ్

వనస్థలిపురం: వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఎల్లమ్మదేవి ఆలయంలో ఆదివారం రాత్రి జరిగిన బోనాల ఉత్సవాలకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి, పవన్, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి స్పందన కరువు

చాదర్‌ఘాట్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 మలక్‌పేట కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైంది. సర్కిల్‌లో ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని డీసీ జయంత్ తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కార్పొరేటర్

వనస్థలిపురం: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలలోనే వేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యాదయ్యతో కలిసి డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలో చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ఎంత చెత్తను శుభ్రం చేసినా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత కాలనీవాసులపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ లావణ్య, జవాన్ యాదయ్య, సూపర్‌వైజర్ శ్రవణ్, కాలనీ వాసులు సురేందర్‌కుమార్, రమణ, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నాగోలులో బోనాల ఉత్సవాలు



నాగోలు: నాగోలులో కమరాతి బీరప్పస్వామి దేవాలయంలో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీరప్ప స్వామికి బోనాలు సమర్పించారు. ఈ వేడుకల్లో ఐలయ్య, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో..

నాగోలు గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. మాజీ సర్పంచ్ గొల్కొండ మైసయ్య ఆధ్వర్యంలో జైపురికాలనీలోని పోచమ్మ దేవాలయంలో బోనాలు సమర్పించారు. వినోద్‌కుమార్, అనిల్‌కుమార్, సాయికిరణ్, మల్లెల శ్రీకాంత్, డప్పు వెంకటేష్ పాల్గొన్నారు.


బీరప్ప స్వామికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రోడ్లపై మురుగు.. శుభ్రత కనుమరుగు

- హస్తినాపురం డివిజన్‌లో దుర్గంధంగా పరిసరాలు
- రోగాలబారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీల కారణంగా మురుగు ఏరులై పారుతోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏ రోడ్డుపై చూసినా మురుగు నీరే పారుతోంది. దీని కారణంగా దోమలు విజృంభించి రోగాలబారిన పడేస్తున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. హస్తినాపురం, చంపాపేట, వనస్థలిపురం డివిజన్లలో దాదాపు 170కి పైగా కాలనీలు ఉండగా ఆయా డివిజన్ల పరిధిలోని పలు కాలనీలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. ఈ ప్రాంతాలలో పూర్తిస్థాయి డ్రైనేజీ లేకపోవడంతో నిత్యం మురుగు రోడ్లపైనే పారుతూ ఉంటుంది. పారిశుద్ధ్య పనులు సైతం సక్రమంగా జరగకపోవడంతో కాలనీలలో చెత్తా చెదారం పేరుకుపోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో రోడ్ల పక్కన బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారం పేరుకుపోయి పిచ్చి మొక్కలు పెరిగినా వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో వర్షం, మురుగునీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారుతుంది. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.


మురుగు పారడంతో గుంతలమయంగా మారిన రోడ్డు


రోడుపై పారుతున్న మురుగు

బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాగలక్ష్మి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాగలక్ష్మి పదవీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అరుణ వికలాంగుల సంక్షేమశాఖ పీడీ డైరెక్టర్‌గా ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ.. బధిరుల ఆశ్రమ పాఠశాలలో మెరుగైన సదుపాయాలతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వసతుల కల్పనకు కృషి


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌ను అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కృష్ణతులసినగర్‌లో రూ. 20 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్ ప్రహరీ, వాకింగ్ పాత్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలం వివాదానికి తెరదించి కమ్యూనిటీహాల్ నిర్మించామన్నారు. కాలనీవాసుల సౌకర్యార్థం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి సురేందర్, కొంగర ప్రవీణ్, జయరాజ్, రఘు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన రమాకాంత్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 27 వేల చెక్కును సోమవారం తన నివాసంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ద్వారా పేద కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ బ్లైండ్స్ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్, స్లాబ్ పనులకు కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ స్లాబ్ నిర్మాణంలో నాణ్యత పాటించి కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు.

నియామకం


వంశీవర్ధన్‌రెడ్డి

మన్సూరాబాద్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి పవనగిరికాలనీకి చెందిన సామిడి వంశీవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాజేంద్రనగర్‌లోర్డేఆర్ దేవరాజ్ భవన్‌లో జరిగిన నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంశీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 6 మండలాల్లో మాత్రమే ఎఐఎస్‌ఎఫ్ కమిటీలు ఉన్నాయని, భవిష్యత్‌లో అన్ని మండలాల్లో నియమిస్తామన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని సీపీఎం నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని తట్టిఅన్నారం సర్వే నంబర్ 73లోని సుమారు ఎకరం ప్రభుత్వ భూమిని జె కన్వెన్షన్ యాజమాన్యం ఆక్రమించిందని ఆరోపించారు. ప్రభుత్వ భూమి గుండా 40 అడుగుల రోడ్డును కన్వెన్షన్ హాలుకు వేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు రోడ్డును కన్వెన్షన్ హాలు యాజమాన్యం పక్కనున్న ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి లీజుకు ఇచ్చిందని సీపీఎం నాయకులు తహసీల్దార్ రవీందర్ దత్తు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ జరిపి అక్కమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏర్పుల నర్సింహ, శివకుమార్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులను చూసి పరుగులు

- నాలుగో అంతస్తు పైనుంచి పడి యువకుడు మృతి


ఖలీం పాషా(ఫైల్)

సైదాబాద్: ఎక్సైజ్ పోలీసులను చూసి భయపడి పరిగెత్తిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు పైనుంచి పడి మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుని బంధువులు, సింగరేణి కాలనీ వాసుల వివరాల ప్రకారం.. సింగరేణి కాలనీలో నివసించే ఖలీం పాషా (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కాలనీలోని ఓ దుకాణం ముందు కూర్చొని ఉండగా అప్పుడే అక్కడికి మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు వచ్చారు. వారిని చూసి భయపడిన ఖలీంపాషా అక్కడి నుంచి పరిగెడుతూ సమీపంలోని వాంబే గృహసముదాయాల నాలుగవ అంతస్తు పైకి చేరుకొని అక్కడి నుంచి పైపుల ద్వారా కిందకు దిగే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఖలీంపాషాను ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఖలీం పాషా మృతికి మలక్‌పేట ఎక్సైజ్ పోలీసుల తీరు, కాలనీలో మత్తు పదార్థాల అమ్మకాలే కారణమంటూ మృతుని కుటుంబ సభ్యులు చంపాపేట రహదారిపై నిరసనకు దిగడంతో వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తామని చెప్పడంతో నిరసన విరమించారు. సింగరేణి కాలనీలో విచ్చలవిడిగా గంజాయి, మత్తు పదార్థాలు అమ్ముతున్నా మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదని సింగరేణి కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడూ తనిఖీల పేరుతో హడావుడి చేయడం తప్ప, ఇక్కడి యువకులు మత్తుకు బానిసవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.


చంపాపేట రహదారిపై ధర్నా చేస్తున్న మృతుని బంధువులు